ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ముంచిన మిచౌంగ్



భట్టిప్రోలులో వర్షపు నీటిలో ఉన్న వరి ఓదెలు

- బాపట్ల వద్ద తీరం దాటిన తుపాను
- భారీవర్షం, పెనుగాలులతో రైతులకు తీవ్ర నష్టం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి
- బాపట్ల జిల్లాలో నేడూ పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, ఒంగోలు బ్యూరో

మిచౌంగ్ తుపాన్ మంగళవారం మధ్యాహ్నం బాపట్ల-నిజాంపట్నం మధ్యలో తీరాన్ని దాటింది. తుపాను ప్రభావంతో సూర్యలంక తీరంలో సముద్రం 20 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. బాపట్ల జిల్లా, ప్రకాశం జిల్లాల్లో భారీవర్షాలు, పెనుగాలుల కారణంగా రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో కోతలకు సిద్ధంగా ఉన్న 50 వేల ఎకరాలలోని వరి పైరు, కొద్ది రోజుల్లో కోతలకు సిద్ధం కానున్న మరో లక్షన్నర ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పలు చోట్ల మిర్చి, పొగాకు, శనగ పంటలు నీటమునిగాయి. బాపట్ల పట్టణం చీలు రోడ్ సెంటర్లో కోదండరామస్వామి దేవాలయం ప్రహరీ గోడ కూలిపోయింది. చీరాల, ఇంకొల్లు ప్రాంతాల్లో కాలువల్లో పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. భారీవర్షాల నేపథ్యంలో బుధవారం కూడా బాపట్ల జిల్లాలో పాఠశాలలకు కలెక్టర్ రంజిత్‌బాషా సెలవు ప్రకటించారు.

మిచౌంగ్ తుపాను కారణంగా జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. మొన్నటి వరకు సాగునీటి కోసం నానా కష్టాలు పడిన రైతులు పంట చేతికి వచ్చే సమయంలో వచ్చిన తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోనున్నారు. వర్షాల కారణంగా ప్రధానంతో వరితో పాటు మిరప, శనగ, మొక్కజొన్న, జొన్న, పత్తి, మినుము పంటలు దెబ్బతినే అవకాశముంది. వరద నీరు ▶ 2లో



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున



అద్దంకి మండలం, తిమ్మాయపాలెంలో పూర్తిగా నీటమునిగిన శనగ



కంభంలో దెబ్బతిన్న అరటి తోట



ఒంగోలు, పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

రూ.3 కోట్ల విలువైన

ప్రభుత్వ భూమి కబ్జా.!

- గతంలో ఆక్రమణను అడ్డుకున్న అధికారులు
- ప్రస్తుతం మౌనం దాల్చిన రెవెన్యూ యంత్రాంగం



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ శివారు ప్రాంతాల్లోనూ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సమీప గ్రామాల్లోనూ రహదారికి ఆనుకుని ఉన్న ఎకరం భూమి రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు అప్పనంగా వచ్చే ఆదాయం కోసం ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. అందులో భాగమే వేములకోట ఇలాఖాలోని సర్వే నెంబరు 164లో 0.33 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది.

మార్కాపురం పట్టణానికి ఆనుకొని ప్రభుత్వ జిల్లా వైద్యశాల ఉంది. దాని సమీపంలో కంభం–మార్కాపురం రహదారి ఆనుకుని రెవెన్యూ శాఖ ఆధీనంలో 0.33 సెంట్ల భూమి ఉంది. ఆ భూమికి ఇరువైపులా ప్లాట్ల వ్యాపారం జరుగుతోంది. ఆ స్థలానికి దగ్గరగా నివాసాలు ఏర్పడ్డాయి. మార్కాపురం పట్టణం ఆ ప్రాంతానికి కలిసిపోయి ఉంది. ఆ ప్రాంతం మాత్రం వేములకోట ఇలాఖా పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం అక్కడ స్థలాల రేట్లు పెరిగిపోయాయి. నివాసాలకు యోగ్యంగా... పట్టణానికి కిలోమీటరు దూరం లోపలే ఉన్నందున అక్కడ వేసిన వెంచర్లు హాట్‌హాట్‌గా అమ్ముడుపోతున్నాయి. అక్కడ రహదారికి ఇరువైపులా గజం స్థలం రూ.20 వేలకు పైగా ఉంది. లోపల ఎక్కడో రూ.15 వేల ధర ఉంది. అక్కడి 0.33 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ధర తక్కువలో తక్కువ అనుకున్నా రూ.3 కోట్ల పై మాటే. ఈ భూమిని కొట్టేసేందుకు వేములకోట గ్రామానికి ▶ 2లో

తుపాన్ నేపథ్యంలో

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి- చీరాల, ఇంకొల్లు, పొదిలి

తుపాన్ నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. చీరాలలో ఒకరు కాల్వలో పడి మృతిచెందగా ఇంకొల్లులో బైకిస్టు బైక్‌తో సహా నీటిమడుగులో పడి మృత్యువాతపడ్డాడు. పొదిలిలో తుపానులో చిక్కుకొని ఓ పశువుల కాపరి మృతిచెందాడు.

డ్రైనేజీ కాల్వలో పడి..

చీరాల, పేరాల ఉజిలీపేట అరవ కాలనీ వద్ద డ్రైనేజీ కాల్వలో పడి వ్యక్తి మతి చెందాడు. కాలనీలో నివాసం ఉంటున్న పి.డాక్టర్ అనే వ్యక్తి మూత్ర విసర్జనకు కాలువ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందినట్లు తెలిసింది. ఒకటో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు.

నీటిమడుగులో పడి మరొకరు..

గుర్తుతెలియని యువకుడు నీటిమడుగులో పడి మృతిచెందిన ఘటన ఇంకొల్లులో మంగళవారం సాయంత్రం వెలుగుచూసింది. ఇంకొల్లు–పావులూరు రోడ్‌లో రావి చెట్టు సమీపంలో రోడ్డు మార్గంలోని నీటిమడుగులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం స్థానికులకు కనిపించింది. నీటిలో ద్విచక్ర వాహనం కూడా పడి ఉంది. యువకుడు ఎవరనేది తెలియరాలేదు. తహశీల్దార్ బ్రహ్మయ్య, ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొలానికి వెళ్లి..

ఒక వ్యక్తి గేదెలను మేపేందుకు పొలానికి వెళ్లి తుపానులో చిక్కుకుపోయి మరణించిన సంఘటన మర్రిపూడి మండలం తంగెళ్లలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొచ్చర్ల శ్రీను(50) మరో ముగ్గురు వ్యక్తులు పశువులు కాసేందుకు పొలం వెళ్లారు. ముగ్గురూ మూడు దిక్కులకు పశువులు తోలుకొని వెళ్లారు. కొంత సమయం తరువాత చూడగా శ్రీను మృతిచెంది ఉన్నాడు. శ్రీను తుపానులో చిక్కుకుపోయి మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముంచిన 'మిచౌంగ్'

(మొదటిపేజీ తరువాయి)

వేగంగా దిగువకు వెళ్లే పరిస్థితి లేనందున ఎక్కువ రోజులు పంటలన్నీ నీటిలోనే ఉండే పరిస్థితి. గడిచిన నాలుగేళ్ళుగా మురుగు కాలువకు మరమ్మత్తులు లేవు. తూటి కాడ కూడా సక్రమంగా తొలగించిన పరిస్థితి లేదు. అందువల్ల మురుగునీరు ఎక్కడిక్కడే ఎక్కువ రోజులు ఉండిపోతుంది. దీంతో కోతకు వచ్చిన వరి పైరు, తక్కువ రోజులు పంటగా ఉన్న మెట్ట పైరు ఉరకెత్తి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. గడచిన మూడు సంవత్సరాలుగా పంట చేతికి వచ్చేదశలో తుపాన్ల రాకతో రైతులు నష్టపోతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సిపిఎం

తుపాను కారణంగా మాగాణి, మెట్ట ప్రాంతంలో పండించిన పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిన నేపథ్యంలో రైతులకు రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని, పేదలకు నిత్యావసర సరుకులు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, టి.కష్ణమోహన్ కోరారు. జిల్లాలో వరి పంటకు ఎక్కువగా నష్టం వాటిల్లిందని, అలాగే మెట్ట ప్రాంతంలో పొగాకు, మినుము, అరటి తోటలకు ప్రధానంగా నష్టం జరిగిందని తెలిపారు. పంటనష్టం అంచనాలు వేసి వెంటనే నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా న్యాయం జరిగే విధంగా చూడాలని చెప్పారు. గత మూడు రోజుల నుంచి అధిక వర్షాలు ఉండటంతో పాటు, మరో మూడు రోజులు కూడా ఈ విధంగా వర్షాలు ఉండటం వల్ల పేదలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

తుపాను నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా బాపట్ల జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు బుధవారం కూడా శెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

'ప్రకాశం'లో వర్షపు నీటిలో 38,483 ఎకరాలు

మౌచింగ్ తుపాన్‌తో భారీవర్షాల కారణంగా ప్రకాశం జిల్లాలోనూ పంటలకు నష్టం వాటిల్లింది. రెండురోజుల్లోనే జిల్లా సగటు వర్షపాతం 79.5 మి.మీలు నమోదైంది. వరి, పొగాకు, మిర్చి, శనగ పంటలకు భారీ నష్టం జరిగే అవకాశముంది. జిల్లాలో మొత్తం 38,483 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు జెడిఎ శ్రీనివాసరావు తెలిపారు. భారీవర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగుతున్నాయి. పలుచోట్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. జిల్లాలో పొగాకు, వరి, మిర్చి, శనగ, మినప తదితర పంటలు నీటిలో మునిగాయి. కోస్తా మండలాల్లో ఎక్కువ నష్టం కనిపిస్తోంది. పొలాలు కొన్నిచోట్ల చెరువుల్లా కనిపిస్తున్నాయి. వర్షపునీరు చేరింది. బయటకువెళ్లాక ఆ పంటల పరిస్థితి ఏమిటన్నదీ ప్రశ్నార్ధకంగా మారింది. వరి కోతలకు వచ్చింది. కొన్నిచోట్ల కంకి దశలో ఉంది. వరి నేలవాలింది. మిర్చి తోటలకు భారీగానే నష్టం కనిపిస్తోంది. పొగాకు తోటలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తీరందాటే సమయంలో మంగళవారం నాడు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. పంట నష్టాలను అంచనావేయాల్సి ఉంది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో గంటల తరబడి కరెంటు లేదు. జనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డారు. లోతట్టుప్రాంతాల్లో కాలనీలు నీటమునిగాయి. పేదల కాలనీలోకి నీళ్లు చేరాయి. యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 46 శిబిరాలను ఏర్పాటు చేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్, స్పెషలాఫీసర్ ప్రద్యుమ్నకుమార్, కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి సహాయకచర్యలు పర్యవేక్షించారు. ఒంగోలులో ఓ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇక వర్షం కారణంగా ఒంగోలు మీదుగా చెన్నయ్,విజయవాడకు వెళ్ళే పలు రైళ్లు రద్దయ్యాయి. ప్రయాణాలు ఆగిపోయాయి. ఇక ఒంగోలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఇక్కడ కార్పొరేషన్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

దర్శిలో అంధకారం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో తుపాను గాలులకు విద్యుత్ వైర్లపై చెట్టు పడడంతో ఐదు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి దర్శి పట్టణంలో అంధకారం నెలకొంది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 7గంటల వరకు విద్యుత్ సరఫరా లేని కారణంగా ఇళ్లలో మోటారు పనిచేయక, నీళ్లు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా మొబైల్‌కు ఛార్జింగ్ లేకపోవడంతో సమాచారం వ్యవస్థ దెబ్బతిని ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా రాత్రి 7గంటలకు అధికారులు పునరుద్ధరించారు. దర్శిలో 144.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ ప్రసాద్ తెలిపారు. మండలంలో ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం లేదని తహశీల్దారు కే వెంకటేశ్వర్లు వెల్లడించారు. కాటేరువాగు వద్ద నీరు నిల్వ ఉన్నప్పుడు ఆ వాగులోని చెట్లు తొలగించామని, ఎక్కడా రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు. వాగుల వద్ద పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. పంట పరిస్థితి నష్టం నేడు తెలిసే అవకాశాలు ఉన్నాయని తహశీల్దారు తెలిపారు. రాజంపల్లి వద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో గ్రామస్తుల సహకారంతో పోలీసులు చెట్టును పక్కకు తొలగించారు. తుపాను కారణంగా ఉదయం నుంచి వర్షం పడటంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేదు. ప్రయాణాలు కూడా వాయిదా వేసుకున్నారు. నిత్యావసర సరుకులు కూడా కొంతమంది సాయంత్రం వరకు కొనుగోలు చేయలేదు. సాయంత్రం వర్షం తగ్గిన వెంటనే ప్రజలందరూ



దర్శిలో విరిగిన పడిన విద్యుత్ స్తంభం

ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చారు.

హనుమంతునిపాడు : తుపాను కారణంగా హనుమంతునిపాడు మండల పరిధిలో దాసలపల్లి, ముప్పలపాడు మార్గమధ్యంలో ఉన్న వాగు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వేములపాడు, హనుమంతపురం, హాజీపురం గ్రామాల్లో ఈదురు గాలులు, వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగించాయి.

తహశీల్దారు వివరణ

తుపాను కారణంగా గ్రామాలలో సచివాలయ సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తహశీల్దారు యు పుల్లారావు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు విరిగినందువలన వెంటనే స్పందించి వాటిని సరిచేసి సమస్యలేవీ లేకుండా చూస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు

ఆందోళనలో మినుము రైతులు

ప్రజాశక్తి-పిసిపల్లి

మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వానలకు మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావం వల్ల వీచే గాలులు, వర్షానికి మినుము పంట ఉరకలెత్తుతుందని, పూత రాలిపోతుందని భయపడుతున్నారు. ఇప్పటికే మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదివారం నుంచే కురిసిన వానలకు, ఈదురు గాలికి మిరప మొక్క వాలిపోయింది. దీంతో మినుము వేసిన రైతులు కూడా భయాందోళన చెందుతున్నారు. గతవారం కురిసిన వానలకు మినుము పండుతుందని ఆనందంగా ఉన్న రైతులలో ప్రస్తుతం ఈ తుపాను నిరాశ మిగుల్చుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి వీచిన ఈదురు గాలులు, సోమవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వానలు కురవటంతో ఇప్పటికే మినుము పొలాల్లోకి నీరు చేరింది. మినుము పైరు మొత్తం మొక్క దశకు చేరింది. పూతదశలో వుంది. రాబోయే రోజుల్లో ఇదే మాదిరిగా, వానలు కురిస్తే పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలం మొత్తం మీద 2200 ఎకరాల్లో మినుము సాగు చేశారు.



మినుము పంట

ఎకరానికి ఇప్పటికే వేయి రూపాయల చొప్పున ఖర్చు చేశారు. ఈ విధంగా ఇప్పటివరకు ఆనందంగా ఉన్న మినప రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందుతున్నారు. మినుము కోసం మొదట్లో పొలాలు దున్నటం వలన సకాలంలో వర్షాలు పడక కొంత పొలంలో మొదటిసారి ఆ తర్వాత నెల రోజుల తర్వాత రెండోసారి వానలు కురిసినప్పుడు మిగతా వాటిని రెండుసార్లుగా వేసిన పైరు కూడా ఈ మధ్య కురిసిన వానలకు బాగా పెరిగింది. రైతుల్లో కూడా ఆనందంగా వుంది. కానీ ఇలాంటి పరిస్థితుల్లో ఈ తుపాను ప్రభావం వలన పూత రాలిపోతుందని ఒక పక్క భయం వెంటాడుతోంది. పూత రాలిపోవడమే కాకుండా పొలంలో నీరు ఎక్కువగా ఉంటే మొక్కలు ఉరకెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పదేళ్లుగా ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. గతంలో ఇదే భూమిని ఆక్రమించగా 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. అప్పట్లో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణను అడ్డుకున్నారు. ఆ భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా ఆ బోర్డు దర్శనం ఇవ్వడం లేదు. తీరా చూస్తే ఇటీవలే వెంచర్ వేయబడింది. గతంలో ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తి తాజాగా వెంచర్ వేశారు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులకు తెలిసినా ఎందుకో మౌనంగా ఉన్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరిగే ఆక్రమణ కాదు. కంభం–మార్కాపురం ప్రధాన రహదారిలో... అందులోనూ పట్టణానికి కూతవేటు దూరంలో ఈ ఆక్రమణ జరుగుతోంది. అధికారులు మౌనం వీడకపోతే మరో పది రోజుల్లో ప్లాట్లు వేసి విక్రయించినా ఆశ్చర్చపడాల్సిన పనిలేదు. రూ.3 కోట్లకు పైగా ఖరీదు చేసే భూమి ఆక్రమణకు గురవుతుంటే సంబధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఏదో మతలబు ఉందని, ఆక్రమణదారుడు పట్టపగలే ప్లాట్లకు సిద్ధం చేస్తున్నా మిన్నకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకుంటే తప్ప ఈ భూమి ప్రభుత్వానికి దక్కేలా లేదు.


కొనకనమిట్ల మండలంలో నీట మునిగిన మిర్చి పంట


వెలిగండ్ల మండలం గోకులంలో మెయిన్ రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం


మొగల్లూరులో నీట మునిగిన మినుము పంట

తుపాను బీభత్సం

- విరిగిన స్తంభాలు, చెట్ల కొమ్మలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పంట పొలాల్లో చేరిన నీరు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-కనిగిరి

తుపాను ప్రభావం కారణంగా కనిగిరి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో వృక్షాలతోపాటు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సంబంధిత శాఖ అధికారులు రోడ్లకు అడ్డంగాపడ్డ చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడ ప్రమాదం జరగకుండా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలను చేపట్టారు. కనిగిరి మండలం లింగారెడ్డిపల్లిలో ఆటో మీద పడిన వృక్షాన్ని పక్కకు తొలగించే చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వర్షం తగ్గడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కనిగిరి మండలం ఏరువారిపల్లిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు సర్పంచ్ దమ్ము వెంకటయ్య వర్షం కురుస్తున్నా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను విద్యుత్ సిబ్బందితో కలిసి స్వయంగా చేపట్టారు.

కొనకనమిట్ల: మండలంలో తుపాను ప్రభావం వల్ల రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షంతో పాటు ఈదురు గాలులు బలంగా వీచడంతో కొన్నిచోట్ల మిర్చి పంట నేలకొరిగింది. ఇదేవిధంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గనివెన్నపాడు, వద్దిమడుగు, కొనకనమిట్ల, నాగంపల్లి, ఎదురాళ్లపాడు, బసాపురం బీసీ, ఎస్సీ కాలనీల్లో నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపై నీరు చేరింది. దీంతో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుపాను తీరం దాటకపోతే పంటలు, ఆస్తి నష్టం వాటిల్లే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

పొదిలి: పొదిలిలో తుపాను ప్రభావంతో గత రాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణం లోని ఆర్‌టిసి బస్టాండ్, నవాబుమెట్ట, పిఎన్‌ఆర్ కాలనీ, రథం రోడ్, ఇస్లాంపేట, మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో విద్యుత్ స్తంభాల వద్ద సమస్య ఏర్పడిందని, చెట్లు విరిగి తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి వీటికి మరమ్మతులు నిర్వహించి పట్టణంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎక్కువ శాతం గాలి కారణంగా పలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం పట్టణంలో విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందజేస్తామని, ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని వారు కోరారు.


లింగారెడ్డిపల్లిలో ఆటోపై కూలిన చెట్టు

దెబ్బతిన్న పంటలు

తుపాను ప్రభావంతో పొదిలి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వేసిన పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో ప్రధానంగా కంది, మిరప, వరి పంటలపై తుపాను ప్రభావం పడింది. తలమల, ఉప్పలపాడు, ఏలూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో వరి పంట దెబ్బతిన్నది. ఒక తలమల గ్రామ ఆర్‌బికె పరిధిలోనే 100 ఎకరాల పంట నేలకొరిగింది. అన్నవరం గ్రామంలో మిరప పంట చేలో నీటి నిల్వతో దెబ్బతింది. ఈదురు గాలులకు కంది పంట పూత రాలి పోయింది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికార సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతులు పొలాలలో నిలిచిన వీటిని బయటకు పంపి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షం తగ్గిన వెంటనే పొలాల్లో అధిక తేమను పీల్చుకునేందుకు 20 కేజీల యూరియాను, 10 కేజీల పొటాషియం కలిపి చల్లాలని సూచించారు.

ఈదురు గాలులకు విరిగిన చెట్టు

ఈదురు గాలులకు పొదిలి కంభాలపాడు మార్గంలో నంద్యాల-ఒంగోలు రాష్ట్ర రహదారిపై చెట్టు విరిగిపడింది. విషయం తెలుసుకున్న అధికారులు అరగంటలో దానిని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. పొదిలి పట్టణంలో తహశీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్టు నేలకొరిగింది. బెస్తపాలెం పొగాకు బోర్డు సమీపంలో ఒక భారీ చిల్లచెట్టు విద్యుత్తు తీగలపై పడటంతో సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ఒరిగింది.

వెలిగండ్ల: మిచౌంగ్ తుపాను వల్ల గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలిగండ్ల మండలంలోని మినుము, కంది పంటలు నీట మునిగాయి. మండలంలో ఈ ఏడాది దాదాపు 6 వేల ఎకరాల్లో కంది, 4 వేల ఎకరాల్లో మినుము పంటను రైతులు వేశారు. అయితే మినుము లేతగా ఇప్పుప్పుడే పూత, పిందె దశలో ఉండడం వల్ల పూత రాలి, పిందె కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అసలే సమయానికి వర్షాలు లేక పైర్లు లేటుగా వేయడం దానికి తోడు తుపాను ప్రభావంతో కురిసేవర్షానికి అక్కడక్కడా మినుము వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే వర్షం మరో రెండు రోజులు కురిస్తే మినుము పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని మండలంలోని రైతులు వాపోతున్నారు. నీట మునిగిన పంటలను వ్యవసాయశాఖ అధికారి రంగకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని హుస్సేన్‌పురం, ఆర్‌జి పురం, గన్నవరం గ్రామాల్లో మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు, కనిగిరి ఇవి రమణయ్య, వ్యవసాయ శాఖ అధికారి రంగకృష్ణ, విఎఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టిన ఆర్డీవో జాన్ ఇర్విన్

విరిగిన విద్యుత్ స్తంభం

తుపాను కారణంగా సోమవారం నుంచి మొదలైన గాలివానకు మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గోకులం వెలుగండ్ల వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభం పడిపోయింది. రాత్రివేళ కావటంతో అటుగా వెళ్లే వాహనాలు గాని, ప్రజలు గాని లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో సోమవారం రాత్రి అంతా కరెంటు లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి. భారీ వర్షాల కారణంగా మండలంలోని మొగళ్లూరు గ్రామంలో మినుము పంట చేలోకి నీరు చేరింది.

సంతనూతలపాడు: మిచౌంగ్ తుపాను కారణంగా నీటి మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి పీ పావని మంగళవారం పరిశీలించారు. మండలంలోని పేర్నమిట్ట కామేపల్లివారిపాలెం గ్రామాలలో నీట మునిగిన పొగాకు, శనగ తదితర పంటలను ఏవో పరిశీలించారు. వర్షం తగ్గిన వెంటనే పొలాలలో అధికంగా నిలిచిన నీటిని బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని రైతులకు ఆమె సూచించారు. శనగ, మినుము తదితర పంటలకు వేరు కుళు ఆకు మచ్చ తెగుళ్లు వచ్చే అవకాశం ఉన్నందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సూచించారు. ఇప్పటివరకు మండలంలో అన్ని గ్రామాల్లో కలిపి 1,090 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్లు ప్రాథమిక సమాచారం అందిందని వ్యవసాయ అధికారి తెలియజేశారు. రైతులందరూ తమ పంట వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకుని సంప్రదించి నష్ట నమోదు అంచనాకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.


సంతనూతలపాడు మండలంలో నీటమునిగిన పంట పొలాలను సందర్శిస్తున్న ఏవో పావని


పొదిలి మండలంలో నేలవాలిన వరి పైరును పరిశీలిస్తున్న రైతులు


వెలిగండ్ల మండలంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


నల్లవాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి తహశీల్దారు పిన్నిక మధుసూదనరావు

ఉధృతంగా నల్లవాగు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మంగమూరు-ఒంగోలు మధ్యనున్న నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లవాగుపై 3, 4 అడుగుల మేర వర్షపునీరు ప్రవహిస్తోంది. దీని ప్రభావం వల్ల మంగమూరు-ఒంగోలు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు పిన్నిక మధుసూదనరావు నల్లవాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ వాగుపై రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. మంగమూరు వీఆర్వో సుధాకర్, సంతనూతలపాడు హెడ్ కానిస్టేబుల్ ఎం శ్రీనివాసరావు, వీఆర్‌ఏలు బి బ్రహ్మయ్య, జి వెంకటస్వామి, కే లాజర్ తదితరులు నల్లవాగు వద్ద రాకపోకలను నిలిపివేశారు.



సచివాలయ భవనంలోకి నీళ్లు చేరిన దృశ్యం

సచివాలయంలోకి నీళ్లు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలో తుపాను ప్రభావంతో గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ఒకటో సచివాలయం నీట మునిగింది. సచివాలయంలోకి నీళ్లు వచ్చి ఫర్నిచర్ కొంతమేర నీట మునిగింది. అయితే సచివాలయంలో కొంతభాగం మున్సిపల్ శానిటరీ సిబ్బంది వాడుకుంటున్నారు. సచివాలయంలో ఎటువంటి ఇబ్బంది కలగలేదని, శానిటరీ సిబ్బంది ఉపయోగించే రూములోకి మాత్రం నీళ్లు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు, జడ్‌పిటిసి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కనిగిరి నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని మరపగుంట్ల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు 20 వేల రూపాయలు అందించాలని కోరారు. ప్రభుత్వం తూతూమంత్రంగా చేతులు దులుపుకునే కార్యక్రమం చేయడం మానుకోవాలని, వెంటనే పంచాయతీలోని ప్రతి గ్రామంలోని పొలాలను పరిశీలించి కంది, మినుము, పొగాకు, ఇతర పంటలను తనిఖీ చేసి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ రైతు విభాగం కనిగిరి తెలుగు రైతు అధ్యక్షులు కోరారు.

ఆరుగాలం కష్టం వర్షార్పణం



పర్చూరులో వర్షానికి నేలవాలి దెబ్బ తిన్న మొక్కజొన్న పైరు



తుఫాను బాధితులను పరామర్శిస్తున్న నగరం తహశీల్దారు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పంటలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున మంగళవారం విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. భట్టిప్రోలు, వేమూరు, చుండూరు మండలాల్లోని గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భట్టిప్రోలు మండలం అద్దెపల్లి గ్రామంలో పూర్తిగా నీట మునిగి విడిపోయిన పైరును చూసి రైతులకు సలహాలు చేశారు. వేమూరు మండలం పెరవల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చుండూరు మండలం ఎడ్లపల్లిలో నీట మునిగిన పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని, దెబ్బతిన్న, రంగు మారిన ప్రతి గింజను ఆర్‌బికెల ద్వారా మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు తగిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని భరోసాని ఇచ్చారు. ఆయన వెంట వేమూరు ఎఎంసి మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మాజీ ఎంపిపి నల్లమటి మోహన్, పిహెచ్‌ఈఎస్ చైర్మన్ గాజుల భాను ప్రకాష్, నాయకులు గాజుల మోహన్, కోగంటి లవకుమార్, భట్టిప్రోలు తహశీల్దారు దూలిపూడి వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ శివరామకృష్ణ, వేల్పూరి నాగేశ్వరరావు, చిన్నారి, చెన్నయ్య, అరుణశాస్త్రి, సలీం ఉన్నారు.



వరిబోదెలను పరిశీలిస్తున్న ఎంపి మోపిదేవి వెంకటరమణ

రేపల్లె : రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు పేర్కొన్నారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. రైతాంగం ఏమాత్రం దిగులు చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసినట్లు చేప్పారు. పంట నష్ట పరిహారం అంచనా ప్రక్రియను ప్రభుత్వ యంత్రాంగం అత్యంత చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మండలి అంజయ్య, అరవపల్లి సర్పంచ్ లోయ బాబు, నాంచారయ్య పాల్గొన్నారు.

చుండూరు : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పొలాల్లో మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మంగళవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైసిపి నాయకులు అప్పిరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

చెరుకుపల్లి : మండలంలో వరి పైరుకు భారీ నష్టం వాటిల్లింది. కోసిన వరి ఓదెలు నీట మునిగాయి. కోతకు వచ్చిన వరిపైర్లు నేలవాలింది. 90శాతంపైగా రైతులు నష్టాల పాలయ్యారు.



అద్దంకిలో నీటి మునిగిన మిర్చి పంట

అద్దంకి : మండలంలో మిర్చి సాగు చేసిన రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అద్దంకి, కోరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, జె పంగులూరు మండలాల్లో వేసిన శనగ పంట అంతా నీట మునిగింది. మొక్కజొన్న, మిర్చి పొగాకు, వేసిన రైతుకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న క్రిందకు వాలిపోయింది. మండలంలోని తిమ్మాయపాలెం, కొటికలపూడి, సింగరకొండపాలెం, బొమ్మనంపాడు, కొంగపాడు, నాగులపాడు, మణికేశ్వరం, చిన్నకొత్తపల్లి, గోవాడ, మైలవరం, చక్రాయపాలెం గ్రామాలలో ఇటీవల వేసిన సెనగ రైతులు భారీగా నష్టపోయారు. 200ఎకరాల శనగ నీటిలో మునిగింది. వర్షం కురుస్తుండటంతో పశువులు కొష్టాలకే పరిమితం అయ్యాయి. రెండు రోజుల నుండి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి వరకు విద్యుత్తు పునరుద్ధరణ కాలేదు. దీనితో పిల్లలు, వృద్దులు ఇబ్బందులు పడుతున్నారు.

నగరం : మండలంలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంట పొలాలను ప్రత్యేక అధికారి సైదా నాయక్, తహసిల్దార్ ఎం ప్రమీల, ఎఒ రమేష్ బాబు, ఇఒపిఆర్‌డి ఆశాజ్యోతి మంగళవారం పరిశీలించారు. మండలంలోని పెద్దపల్లి పంచాయతీ శివారు శ్రీనగర్ కాలనీలో పర్యటించి ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు.

పర్చూరు : మండలంలోని అడుసుమల్లి, రమణయ్య పాలెం, చెరుకూరు గ్రామాల్లో తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు ఖరీఫ్‌లో వేసిన వరి, రబీలో వేసిన మిర్చి, మొక్కజొన్న, పొగాకు, శెనగ, మినుము పంటలన్నీ పూర్తిగా మునిగిన నీట మునిగినట్లు ఏడిఏ మోహనరావు తెలిపారు.

రేపల్లె : తుఫాను తీవ్ర ప్రభావం చూపనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ హేల షారోన్ సూచించారు. తుఫాను పునరావాస కేంద్రాలను ఆమె పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బృందాలను సంప్రదించాలని సూచించారు. 8008293401 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



రేపల్లెలో బాధితులను పరామర్శిస్తున్న ఆర్‌డిఒ షారోన్

రేపల్లె : తుఫాను ప్రభావంతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలకు పట్టణంలోని రోడ్లు జలమయం అయ్యాయి. పట్టణంలోని ఇందిరా యానాది కాలనీ, రెండవ వార్డు, నేతాజీ నగర్, జగనన్న కాలనీ నీట మునిగాయి. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని పేటేరు, పెనుమూడి, బొబ్బర్లంక, పిరాటలంక, రాజుకాల్వ, గంగడిపాలెం, తుమ్మల, మోల్లగుంట, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ గ్రామాల్లో 12పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఆహారం, తాగునీటి వసతులు కల్పించారు. కృష్ణ నదిలో నుండి సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లే చిన్న మోటార్ బొట్లులో వర్షం నీరు చేరడంతో నదిలో నిలిపిన రాజుకాల్వ, లంకేవానిదిబ్బ గ్రామాలకు చెందిన 40మత్యకారుల బొట్లు మునిగిపోయి నట్లు చెప్పారు.

సంతమాగులూరు : తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలలకు గుంటూరు, కర్నూలు రహదారిపై భారీ చింత చెట్టు రహదారిపై కూలింది. దీంతో వాహన రాకపోకలు రోడ్డుకిరువైపుల నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు స్పందించి భారీ వర్షంలో కూడ జెసిబితో చెట్టును తొలగించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

భట్టిప్రోలు (వేమూరు) : తుఫాను కారణంగా వర్షానికి దెబ్బతిన్న పంటలను ఎఒ సిహెచ్ సునీత పరిశీలించారు. వరి పొలాల్లో నీటిని తీసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. తడిసిన వరి పనలపై ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారి చేసుకుంటే మొలక రాకుండా ఉంటుందని అన్నారు. ఈమె వెంట ఎంపీపీ ఎలమటి మోహన్ ఉన్నారు.

సంతమాగులూరు : తుఫాన్ ధాటికి మండలంలోని వాగులు, పంట పొలాల్లో నీరు ఉధృతిగా ప్రవహిస్తా ఉంది. వరి, మిరప, కంది, శనగ, బొప్పాయి, మొక్కజొన్న మొదలగు పంటలు దెబ్బతిన్నాయి. ప్రాథమికంగా 468 ఎకరాలు వరి, 142 ఎకరాలు మినుము, 235 ఎకరాలు మొక్కజొన్న, 1144 ఎకరాలు శనగ, 63 ఎకరాలలో కంది పంట నష్టం జరిగిందని ఎఒ లావణ్య తెలిపారు.

అద్దంకి : తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాప్‌నెట్ ఛైర్మన్, వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య సూచించారు. తుఫానుతీరం దాటే సమయంలో వర్షతీవ్రత మరింత అధికంగా ఉండవచ్చని తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, తీగలవద్ద అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రైతులకు వైసీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.



పర్చూరులో నీటి మునిగిన వైట్‌బర్లీ

పర్చూరు : తుఫాను ప్రభావంతో పర్చూరు పరిసర ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎటు చూసినా వర్షపు నీటితో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు ప్రజలు బిక్కు బిక్కుమంటూ ఇళ్ళల్లోనే కాలం గడుపుతున్నారు. భారీ వర్షాలకు వీరన్నపాలెం వద్ద నేలచప్టాపై నీళ్లు ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంకాయలపాడు వద్ద వాగు ఏడు అడుగుల ఎత్తు ప్రవహిస్తుండటంతో పర్చూరు – ఇంకొల్లు గ్రామాల మధ్య, పోలూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు – మార్టూరు గ్రామాల మధ్య, అడుసుమల్లి – ఇనగల్లు గ్రామాల మధ్య ఉన్న నేల చప్టాపై నుండి వర్షపునీరు ప్రవహిస్తూ ఉండటంలో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నష్టపోయిన పంట పొలాలను ఎడిఎ మోహనరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పర్చూరు, నాగులపాలెం, చెరుకూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో వర్షపు నీరు చేరడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది.

భట్టిప్రోలు : ప్రస్తుత తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షించారు. తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భట్టిప్రోలుకు ఈఓపిఆర్డి ఊహారాణి, ఐలవరంకు ఎంఈఓ దేవరాజ్, పెదలంక, పెసర్లంక గ్రామాలకు ఏబీఎన్ శ్రీమన్నారాయణ, వెల్లటూరుకు ఇరిగేషన్ ఏఈ రాంబాబు, పెదపులి వరకు ఆర్డబ్ల్యూఎస్ ఏఇ శివకుమార్, గొరిగిపూడికి శివపార్వతి, ఒలేరుకు హౌసింగ్ ఏఇ సౌమ్య, పల్లెకోన, రాచురు గ్రామాలకు ఏఓ మీరయ్య, కోనేటిపురం, ఆలమూరు గ్రామాలకు పిఆర్ఏఈ రామచంద్రరావు, సూరేపల్లి గ్రామానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఫజాలున్నిస్సా ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి ఉదయ భాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, ఎఒ మీరయ్య, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాల : తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు జలమయం కావడంతో సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఉన్న అరవ కాలనీ మునిగి పోయింది. పక్కనే ఉన్న స్కూల్లో పునరావాసం కల్పించారు. బాధితులను సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, లింగం జయరాజు పరామర్శించారు. కాలనీ ప్రజల ఇళ్ల సమస్యపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు పట్టించుకోని కారణంగానే ఇళ్ల చుట్టూ నీళ్లు చేరి ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. తక్షణం కాలనీ పేదలకు ఇళ్లు మంజూరు చేసి, మురుగునీళ్లు లేకుండా మెరకతోలి, కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



చీరాలలో బాధితులకు సిపిఎం నేతల పరామర్శ



నిర్మానుష్యంగా ఉన్న పట్టణ ప్రధాన రహదారి

స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - బాపట్ల

మిచౌంగ్ తుఫానుధాటికి రెండు రోజులుగా దంచి కొడుతున్న వర్షాలకు పట్టణంలో జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. పట్టణంలో చీలు రోడ్డు సెంటర్లోని కోదండ రామాలయం ప్రహరీగోడ పునాదులతో కూలిపోయింది. రామాలయం గోపురం సైతం పక్కకు ఒరిగినట్లు కనిపిస్తోంది. మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు ప్రహరీ గోడ కూలిపోయింది. గోడకు ఆనుకొని ఉన్న చెట్టు కూలిపోవడంతో ఉప్పరపాలెం, బాపట్ల మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. తక్షణమే స్పందించిన మునిసిపల్ టిపిఓ లక్ష్మి అక్కడి అగ్నిమాపక సిబ్బందితో కూలిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పట్టణ శివారులోని శ్యాంప్ డ్రెయిన్ పొంగిపొర్లుతోంది. ఏ క్షణాన్నైనా కట్ట తెంచుకొని శారదాపురి కాలనీని ముంచేత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కోనేటి అనిల్

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురియడంతో పట్టణం సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలో పేదల పూరి గుడిసెల్లోకి నీరు చేరింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు కోనేటి ఎంటర్ప్రైజెస్ అధినేత కోనేటి అనిల్, అతని సహచరులు 20వ వార్డులో దాదాపు 100కుటుంబాలకు సరిపడే నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రతి కుటుంబానికి 5కేజీల బియ్యంతో పాటు కూరగాయలు, నూనె, కందిపప్పు, ఇతర వస్తువును అందించారు.

వర్షంతో అతలాకుతలం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. ఎక్కడికక్కడ రహదారులు జలమయం అయ్యాయి. మండలంలోని ఐలవరం దళితవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చుట్టూ వర్షపు నీరు చేరి గ్రామస్తులకు ఆందోళన కలిగించింది. చుట్టుపక్కల గృహాల్లో కూడా వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వ తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పంచాయితీ కార్యాలయంలో వర్షం నీటిని తోడేస్తున్న సిబ్బంది

పంచాయతీ భవనంలో నీళ్లు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీ కార్యాలయంలోనికి తుఫాను వలన కురిసిన భారీ వర్షంకు వర్షపు నీరు చేరినది. స్పెషల్ ఆఫీసర్ రమణ, తహశీల్దారు ఏ శ్రీనివాసరావు, ఎంపీడీఒ ఐ సత్యనారాయణ, వేమూరు సిఐ వెంకటేశ్వరావు గ్రామంలో తుఫాను పరిస్థితులను స్థానిక సర్పంచి టి కృష్ణమోహన్, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి తమ పంచాయతీ కార్యాలయానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మెరక తోలి కొత్త భవనం నిర్మించాలని కోరారు. పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు అందించి ఆదుకోవాలని కోరారు.

పొంగిన వాగులు..మునిగిన పంటలు..

- స్తంభించిన రాకపోకలు
- అంధకారంలో గ్రామాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహించాయి. పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని హనుమాపురం దండువాగు కొత్తకోట వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకల అంతరాయం కలిగింది. వాగుకు ఇరువైపుల నాగులుప్పపాడు , మద్దిపాడు ఎస్ఐలు హరిబాబు, శ్రీకాంత్ బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. విద్యుత్ స్తంభాలు దెబ్బతినంతో విద్యుకు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో సోమవారం రాత్రి నుంచి ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు లోతట్టు ప్రాంతాల్లో


పొంగి ప్రవహిస్తున్న వాగు

జలమయవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నీటమునిగిన పంటలను వ్యవసాయ శాఖ ఎడిఎ రమేష్ , ఎఒ వెంకట్రావు, ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష, సచివాలయ సిబ్బంది పరిశీలించారు.

పంటలకు నష్టం

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి మినుము, పొగాకు, కంది, మిరప పంటలు దెబ్బతిన్నాయి. నీటి మునిగిన పంటలను ఒంగోలు ఎడిఎ రమేష్‌బాబు, ఎఒ వెంకటరావు, ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ రమేష్ బాబు మాట్లాడుతూ 1,750 ఎకరాల్లో వరి, 417.5 ఎకరాల్లో మినుము పంట, 35 ఎకరాల్లో కంది, 2,312.5 ఎకారల్లో మినుము, 2,500 ఎకరాల్లో పొగాకు పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పొలాల్లో నీరు తగ్గిన వెంటనే పూర్తి స్థాయిలో పంట నష్టపోయిన రైతుల జాబితా తయారు చేసి అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.ఎఒ వెంకటరావు మాట్లాడుతూ పొలాల్లోని నీటిని బయటకు పంపి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ చల్లాలన్నారు. ఇలా చేయడం ద్వారా కొంత మేర నష్టం తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష మాట్లాతూ మిరప తోటల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంతగా త్వరగా బయటకు పంపాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా లాంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలన్నారు.

నేలకొరిగిన అరటి తోటలు

కంభం రూరల్ : మిచౌంగ్ తుపాను ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పంట నీటిమునిగింది. గాలులకు సుమారు యాభై ఎకరాలలో అరటి చెట్టు నేలకొరిగాయి. పసుపు, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి.


నాగులుప్పలపాడులో నీటి మునిగిరి మిర్చి తోట

తడిసిన మిర్చి

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి మిర్చి రైతులకు నష్టం వాటిల్లింది. కోసి ఆరబెట్టిన కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసింది. పంటను కాపాడుకునేందుకు రైతులు మిర్చిపై పట్టలు కప్పినప్పటికీ చాలా చోట్ల పంట తడిచింది. తడిసిన కాయలు బూజుపట్టి పనికి రాకుండా పోతాయని రైతులు వాపోతున్నారు. **యర్రగొండపాలెం :**తుపాను ప్రభావంతో గురిజేపల్లి గ్రామంలో కళ్ళాల్లో ఆరబెట్టిన మిరప కాయలు తదిసి ముద్దయ్యాయి. తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మార్కాపురం రూరల్ :మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న ఎడతెరపు లేని వర్షాలకు ప్రజల జీవనం అస్తవ్యస్తంగా తయారైంది. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు.


చీమకుర్తిలో గ్రానైట్ క్వారీలోకి చేరిన వర్షపు నీరు


అమ్మనబ్రోలులో నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


పెద్దదోర్నాలలో పట్టలు కప్పిన మిర్చి

చలితో వణికిన ప్రజలు

- ఇళ్లకే పరిమితం
- విద్యుత్తు, తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షం, చలిగాలులకు ప్రజలు ఇళ్లలోనుంచి బయటకు రాలేకపోయారు. చలిదాటికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు. వర్షం, గాలి ప్రభావంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాం ఏర్పడింది. మంగమూరు రోడ్డు బైపాస్‌లోని విద్యుత్తు సబ్ స్టేషన్ పక్కన ప్రవహిస్తున్న డ్రెయినేజీలో చెత్తా చెదారం అడ్డుపడింది. దీంతో కాలువ పొంగి వర్షపునీరు సమీపంలోని సబ్ స్టేషన్‌లోకి చేరింది. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అప్రమత్తమైన విద్యుత్తు, నగరపాలక సంస్థ అధికారులు నీటిని బయటకు పంపేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విద్యుత్తు సరఫరాలో ఆటంకం కలగడంతో నగరంలోని తాగునీటి సరఫరాలోనూ సమస్యలు తలెత్తాయి. శివారు కాలనీలు, విలీన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ కొన్ని కాలనీలకు ట్యాంకర్లు వెళ్లే వీలు లేక నీటి సరఫరాను నిలిపి వేశారు. మదర్‌థెరిస్సాకాలనీ, బాలినేని వాసు కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, పులివెంకటరెడ్డి కాలనీ, బాలినేని భరత్ నగర్, దత్తాత్రేయ కాలనీ, అరవకాలనీ, పోతురాజు పాలెం, గాంధీనగర్ గంగిరెద్దుల కాలనీ, కొప్పోలు, పేర్నమిట్ట అరుణోదయ కాలనీ, వడ్డెపాలెం, శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలలో రోడ్లపై నీరు చేరిది. పలు గృహాలను నీరు చుట్టుముట్టింది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 2,500 మందికి భోజనం ప్యాకెట్లు అందజేశారు. నల్లవాగు, పోతురాజు కాలువ ప్రాంతాలలో పలుచోట్ల వర్షపునీరు ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటంతో భారీ ప్రొక్లయిన్ల సాయంతో వర్షపునీరు పారుదలను పునరద్ధరించారు. సంఘమిత్ర ఆసుపత్రి వద్ద నల్లవాగును కలిపే డిస్పోజల్ డ్రెయిన్ నిండిపోవడంతో వర్షపునీరు పొంగి పొర్లింది. దానికి సమాంతరంగా పక్కనే ఇంకో కచ్చకాలువను నగర మేయర్ గంగాడ సుజాత, 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు, 21 డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు దగ్గరుండి తవ్వించారు. కర్నూలు రోడ్డు చైతన్య కాలనీ ఎదురుగా వర్షపునీరు బయటకు వెళ్లకుండా రోడ్డుమీదకు వస్తుండటంలో నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ జెసిబిని ఏర్పాటు చేసి అక్కడ నీరు బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు. సంతపేట ప్రాంతంలో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. ఆప్రాంతానికి చెందిన కార్పొరేటర్లు చింతపల్లి గోపి, ఇమ్రాన్‌ఖాన్ రంగంలోకి దిగి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు.

తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా జోరుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో నగరంలో పారిశుధ్య పనులు నిర్వహణ సవాల్‌గా మారింది. జోరు వానలోనూ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించేందుకు చెమటోడ్సాల్సిన పరిస్థితి నెలకొంది. ఓవైపు వాన, మరోవైపు చలిని లెక్క చేయక కార్మికులు ఇంటింకి తిరిగిచెత్తనే సేకరించేందుకు కంకణ బద్దులయ్యారు. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు, చెత్తా,చెదారం, తొలగించడం, కాల్వలను శుభ్రం చేయడంలో కార్మికులు కీలక ప్రాత పోషించారు. వారికి అవసరుమైన పనిముట్లు, సేఫ్టీ మెటీరియల్‌ను అధికారులు సమకూర్చక పోయినా పారిశుధ్య కార్మికులు మాత్రం తమ విధి నిర్వహణలో నిబద్ధతను చాటి నగరంలో రోజువారి పరిస్థితులను తీసుకు వచ్చేందుకు కష్టపడి పనిచేశారు.

వడ్డెపాలెంకు చెందిన ప్రజలు 50 మంది డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వచ్చారు. గాంధీనగర్ గంగిరెద్దుల కాలనీ నివాసితులు 200 మంది గాంధీనగర్ సత్యసాయి స్కూల్ తుపాన్ సెంటర్‌లో తలదాచుకున్నారు.

తుపాన్ ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజినీర్ జానీబాషా, వైసిపి యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పలు చోట్ల సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు


భోజనం అందజేస్తున్న బాలినేని ప్రణీత్ రెడ్డి


నీటమునిగిన గంగిరెద్దుల కాలనీ

తుపాను బాధితులకు దామచర్ల పరామర్శ

ప్రజాశక్తి-కొత్తపట్నం,ఒంగోలు

తుపాను తాకిడి ప్రాంతాల్లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ పర్యటించారు. వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతోన్న మత్స్యకారులను పరామర్శించారు. మండల పరిధిలోని పల్లెపాలెం, మడనూరు, ఈతముక్కల గ్రామాల్లో పర్యటించారు. వర్షాల వల్ల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. ఇబ్బందులు పడుతోన్న మత్స్యకారులు సుమారు 1500 మందికి భోజనం, తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం ఒంగోలు పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ, నేతాజీనగర్, కేశవరాజుకుంట,ఎన్‌టిఆర్ కాలనీ, కరుణాకాలనీ, ఎఫ్‌సిఐ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీల్లో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతోన్న ప్రజలను కలిసి మాట్లాడారు. పలుచోట్ల సుమారు 3వేల మందికి భోజనం, తాగునీరు అందజేశారు.



రైతులతో మాట్లాడుతున్న రమాదేవి

పంటలు పరిశీలన

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మండల పరిధిలోని రామచంద్రాపురం, కొండేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప, వరి, ఇతర పంటలను మార్కాపురం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి, ఎఒ దేవిరెడ్డి శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పంటపొలాల్లో నీరు నిల్వ ఉంటే వేరు కుళ్ళ వస్తుందన్నారు. దీంతో మొక్కలకు పోషకాల లభ్యత తగ్గుతుందన్నారు. పురుగులు తెగుళ్ల ఆశిస్తాయని తెలిపారు. వరిపైరులో నీరు నిలిస్తే నీరును బయటకు పంపి ఎకారానికి 20 కిలోల యూరియా పిచికారీ చేయాలన్నారు. మిరప మొక్కలు ఉరకలెత్తి, తలలు వాలిస్తే 10గ్రాముల యూరియా లీటర్ నీటికి కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికెల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **తిపురాంతకం :** తుపాన్ కారణంగా మండల పరిధిలోని వెల్లంపల్లి, గొల్లపల్లి, విశ్వనాధపురం గ్రామాలలో నేలకొరిగిన వరి పంటను ఎఒ నీరజ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** మిచౌంగ్ తుపాను నేపథ్యంలో మండల పరిధిలోని మిల్లంపల్లి, పుల్లల చెరువు మండలంలోని మల్లాపాలెం, రాచకొండ గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం తగ్గిన తర్వాత పంట నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది ఉన్నారు.

ఇదేం పని కమిషనర్ గారు..!

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం పాత కూరగాయల మార్కెట్ ప్రాంతంలోనిది. గత మూడు రోజులుగా కురుస్తున్న మిచౌంగ్ తుపాను కారణంగా ఆప్రాంతంలోని మ్యాన్ హోల్ చెత్తా,చెదారంతో నిండిపోయింది. దీన్ని శుభ్రం చేయించేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, శానిటరీ సిబ్బంది, ఓ పారిశుధ్య కార్మికుడిని మంగళవారం ఉదయం ఆ మ్యాన్ హోల్‌లోకి దింపారు. ఆ కార్మికుడికి ఎలాంటి సేఫ్టీ మెటిరియల్స్ లేవు. కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు లేవు. కనీసం ఒంటిమీద చలిని తట్టుకునేందుకు అవసరమైన దుస్తులు కూడా లేవు. జోరువానలో తన రెండు కాళ్లను మ్యాన్ హోల్‌లోకి పెట్టి ఒట్టి చేతులతో వ్యర్థాలను బయటపడేశాడు. దాదాపు పదుల కేజీల చెత్తా, చెదారం ఒట్టి చేతులతోనే బయటకు



మ్యాన్‌హోల్‌లోని చెత్తచెదారాన్ని తొలగిస్తున్న కార్మికుడు

తీశాడు. సాక్షాత్తు కమిషనర్ సమక్షంలోనే ఇలాంటి 'మురికిపని' జరగడం గమనార్హం. కార్మికులు పనిముట్లు, సేఫ్టీ మెటీరియల్స్ ఇవ్వాలని కార్మికుల పక్షాన కార్మిక సంఘాలు అనేక సార్లు నగరపాలక సంస్థ పాలక వర్గం, అధికారులకు విన్నవించాయి. వారు పెడచెవిన పెడుతున్నారు. చెత్తను సేకరించేందుకు, మురుగు కాల్వలు శుభ్రం చేసేటప్పుడు కార్మికుల చేతులకు బ్లౌజులు తప్పని సరిగా ధరించాలని, డ్రెయినేజీలోకి దిగాల్సి వస్తే అందుకు అనువైన బూట్లు ఏర్పాటు చేయాలని చట్టాలు చెబుతున్నాయి. అయినా నగరపాలక సంస్థ అధికారులకు అదేమి పట్టడం లేదనడానికి ఈ ఫొటోనే నిదర్శనం. తుపాను ప్రభావిత ప్రాంతాల కాల్వలు, మ్యాన్ హోల్స్‌లలో పారిశుధ్య కార్మికులు ఎలా తమ ఆరోగ్యాలను పనంగా పెట్టి పనిచేస్తున్నారనడానికి ఇదే సాక్ష్యం.

9 నుంచి కులగణన సర్వే

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 9 నుంచి19 వరకూ కులగణన సర్వే నిర్వహించనున్నట్లు డిఎల్‌డిఒ బివిఎన్. సాయికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ కులగణన సర్వే నూరు శాతం గహాలను కవర్ చేసే విధంగా ఉండాలన్నారు. 1931 కులగణన సర్వే తర్వాత రాష్ట్రంలో మళ్లీ ఇప్పుడు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల సహాయంతో సర్వే నిర్వహించాలన్నారు. సేకరించిన సమాచారాన్ని గోప్యతగా ఉంచాలన్నారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ తోట చందన, తహాశీల్దారు మంజునాథ్ రెడ్డి, మండల విస్తరణ అధికారి రామ్మోహన్ రెడ్డి, ఎఎస్‌డబ్ల్యుఒ, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పెద్ద దోర్నాల :** కులగణన సర్వేపై మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో మండల ప్రత్యేకాధికారి జగన్నాధరావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాధరావు మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 18 వరకూ కులగణన సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈనెల 15నుంచి ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాసరరెడ్డి, తహాశీల్దారు వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్‌డిఒ సాయికుమార్



కూలిన మిద్దె

తుపాను ప్రభావంతో కూలిన మిద్దె

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మిచౌంగ్ తుపాను కారణంగా మండల పరిధిలోని మొగుళ్లపల్లి ఎస్‌సిపాలెంలో చాట్ల పెద్దఅచ్చయ్యకు చెందిన మిద్దె మంగళవారం కూలింది. ప్రమాదాన్ని గుర్తించిన పెద్దఅచ్చయ్య, వారి కుటుంబ సభ్యులు బయటకు రావడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. తహాశీల్దారు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహాశీల్దారు విజయకుమార్, గ్రామ సర్పంచి కర్నాటి వెంకటేశ్వర రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అచ్చయ్య కుటుంబనికి రూ.3,000 నగదు, 50 కేజీల బియ్యం; 1కేజీ కంది పప్పు, 1కేజీ పంచదార అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు అపార నష్టం

- దెబ్బతిన్న వలలు, బోట్లు
- రహదారిపై కూలిన చెట్లు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మిచౌంగ్ తుపాను ప్రభావంతో మత్స్యకారులకు నష్టం తప్పలేదు. తుపాను నేపథ్యంలో బోట్లు, వలలు ఒడ్డుకు చేర్చుకున్నారు. అయినప్పటికీ ఉవ్వెత్తున ఎగిసే పడుతున్న అలలు తాకిడికి ఒడ్డు చేరిన బోట్లు ఒకదాన్ని ఒకటి ఢీకొట్టుకొన్నాయి. ఫలితంగా కొన్ని బోట్లు దెబ్బతిన్నాయి. వలలు ఇసుకలో కూరుకుపోయాయి. దీంతో నష్టం



దెబ్బతిన్న బోటు



బోట్లు, వలలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే స్వామి

వాటిలినట్లు మత్స్యకారులు వాపోయారు. దేవలంపల్లె పాలెం వద్ద వర్షపునీరు తుపాను షెల్టర్, ఇళ్ల మధ్యలో చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పాకల గ్రామ పొలాల్లోకి నీరు చేరింది. వరినారు మళ్ల నీటి మునిగాయి. శింగరాయకొండ బైరాగి మాన్యంలో గాలులు దాటికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోయింది. విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శింగరాయకొండలోని ట్రంకు రోడ్డు పరిధిలోని పోలీస్ స్టేషన్ వద్ద చెట్లు నేలకొదిగిపోయాయి. దేవిశ్రీ ఫుడ్స్ దగ్గరలో రోడ్డుపై భారీ మర్రిచెట్టు కూలిపోయింది. సిఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఎఎస్‌ఐ మహబూబ్ బాషా, పంచాయతీ అధికారుల సహకారంతో జెసిబితో రహదారి కూలిన చెట్లను తొలగించారు. పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్ప నగర్ లో రేకుల షెడ్డు కూలడంతో ఓ దూడ మృతిచెందింది.

తీర ప్రాంతంలో ఎమ్మెల్యే స్వామి పర్యటన

పాకల, ఊళ్లపాలెం గ్రామపంచాయతీలోని మత్స్యకార గ్రామాల్లో కొండపి ఎమ్మెలే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పర్యటించారు. తొలుత పాకల పల్లెపాలెంలోని సముద్ర తీరాన్ని పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరా లేక పోవడంతో తాగునీటిని ఇబ్బంది పడుతున్నట్లు మత్స్య కారులు తెలిపారు. తమను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మత్స్యకారులకు బియ్యం ఇచ్చి ఆదుకోవాలని ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు సూచించారు. అనంతరం చెల్లెమ్మ గారి పట్టపాలెం, పోతయ్య గారి పట్టపాలెంలో పర్యటించి బోట్లను పరిశీలించారు. దెబ్బతిన్న బోట్లను పరిశీలించారు. మత్సశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడారు. దెబ్బతిన్న బోట్లను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసి నష్టపరిహారం అందేలా చూస్తామని మత్స్యశాఖ జేడీ తెలిపారు. పోతయ్య గారి పట్టపు పాలెం మత్స్యకారలుతో తహాశీల్దారు ఉష, ఎమ్మెల్యే స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు మందలపు గాంధీ చౌదరి, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనవుల్లా, సర్పంచి సైతం చంద్రశేఖర్, మించల బ్రహ్మయ్య నక్క బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వలలు

భోజనం అందజేత

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయులు,సంచార కుటుంబాలు, బస్టాండ్ , జాతీయ రహదారుల వెంబడి మరియు తాతయ్య గిరిజన కాలనీ వాసులకు100 మందికి శింగరాయకొండ అప్డేట్స్ యువత ఆధ్వర్యంలో ఉదయం పూట అల్పాహారం మరియు మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్డేట్స్ సభ్యులు హరి చెన్నంశెట్టి, ఉమేష్ పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పర్చూరు వాగువద్ద పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి



పునరావాస శిబిరంలో బాధితులతో నరేంద్రవర్మ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. మార్టూరు, పర్చూరు మండలాల్లో పంటలను ఆయన పరిశీలించారు. తుఫాను తీవ్రతతో వేలాది ఎకరాల పంటలు నీట మునియని అన్నారు. వరి, ప్రత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంట పొలాలన్నీ నీట మునిగి నష్టం వాటిల్లిందని అన్నారు. అన్నదాతలు ఆశలపై తుఫాను నీళ్లు చల్లిందని అన్నారు. తుఫాను సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. మార్టూరు, పర్చూరు వాగుల్లో తూటికాడ, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వరద నీరు పోయే పరిస్థితి లేదన్నారు. రైతులే మార్టూరు వద్ద కాల్వలో గుర్రపుడెక్క తొలగించారని అన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాను సహాయక చర్యలు, వరద నీటి తొలగింపుపై కలెక్టర్ రంజిత్ భాషాకు ఫోనులో వివరించారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని అండగా నిలిచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని టిడిపి అధినేత చంద్రబాబును కోరారు.

అద్దంకి : తుఫాను కారణంగా ఏకధాటిక కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు, చెరువులు ఏకమై పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ నుండి భారీగా నీరు చేరడంతో నల్లవాగు వంతెనపై నీరు ప్రవహానికి రాకపోకలు నిలిచి పోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సాగర్ కట్ట సమీపంలో రెండు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ నిలిచి పోయింది. మంగళవారం విద్యుత్ పునరుద్దరించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఈదురు గాలులకు చెట్టు నేలకొరిగాయి. వర్షపు నీరు గుండ్లకమ్మకు చేరుకుంది. ఇసుకతోడిన గోతుల్లోకి నీళ్ల నిండాయి. పశుకాపరులు ఆ ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. పట్టణ శివారు ఎన్టీఆర్ నగర్, రాజీవ్ కాలనీ, గుర్రాల కాలనీ, వేలమూరిపాడు వద్ద జగనన్న కాలనీ, నాగులపాడు రోడ్లోని జగనన్న కాలనీలలో వర్షపు నీరు నిలిచిపోయాయి. టిడిపి నాయకులు కోనేటి అనీల్, వెంకట్రావు పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

చెరుకుపల్లి : స్థానిక హైస్కూల్లో పునరావాస శిబిరంలో బాధితులకు ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ సహకారంతో టిడిపి నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దివి రాంబాబు, ఎంఆర్కే మూర్తి, మల్లాది రామకృష్ణ, నాగుల పున్నారావు, సొంటి సుబ్బయ్య, విసంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్ల : బాపట్ల మండలం అడివిపల్లెపాలెం, కృపానగర్ లోని ఏఎంజి పాఠశాల లోని పునరావాస కేంద్రంను టిడిపి ఇంచార్జి వేగేసాన నరేంద్ర వర్మ పరిశీలించారు. వీఆర్వోతో మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి లోటు రానివ్వద్దని కోరారు. ఏమైనా అవసరమైతే తాను తక్షణమే సహాయం అందిస్తానని అన్నారు. పునరావాస కేంద్రంలో సుమారు 350మంది ఉన్నారు. వారికి అల్పాహారం ఏర్పాటు చేశారని వీఆర్వోను అడిగారు. మధ్యాహ్నం మంచి నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అక్కడ స్థానికులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గోగు శివ, సామియేల్, దానయ్య ఉన్నారు.

పర్చూరు : తుఫానుతో జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు, కారంచేడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. నీట మునిగిన మిరప, పత్తి, పొగాకు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నాగులపాలెం శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. ముస్లిం కాలనీ, ఎస్టీఆర్ కాలనీ, నాగుల పాలెం గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం ముందు చూపు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. విద్యుత్ లేక సెల్ ఫోన్లు పనిచేయక, కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయిందని అన్నారు.

సంతమాగులూరు : మండలంలో వర్షాలు, గాలులు వీచడంతో మంగళవారం ఉదయం నుండి విద్యుత్‌ను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో రాత్రుల యందు గ్రామాలు అంధకారంగా మారాయి. వృద్ధులు, పిల్లలు, బాలింతలు దోమల పోటుకు గురై ఇబ్బందులు పడ్డారు. తేలికపాటి వర్షాలు, గాలులు వీచినా విద్యుత్‌ను అధికారులు నిలిపి వేస్తున్నారని గ్రామాలలోని ప్రజలు చెబుతున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చెరుకుపల్లి టిడిపి నేతలు



కర్లపాలెంలో బాధితుల ఆహార తయారీ పర్యవేక్షిస్తున్న జెసి



వాడరేవు శిబిరంలో బాధితులతో ఎంఎల్ఎ బలరాం

బాధితులకు బలరాం పరామర్శ

ప్రజాశక్తి - చీరాల

తుఫాను ప్రభావంతో వాడరేవు తీర ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలను వాడరేవు హైస్కూల్లో ఏర్పాటు చేసిన తుఫాను షర్టులకు అధికారులు తరలించారు. పునరావాస కేంద్రంలో ఉన్న తుఫాను బాధితులను ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, కలెక్టర్ రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. వారి వెంట ఆర్డీఓ సరోజిని, తహశీల్దారు జె ప్రభాకరరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఇన్ఛార్జి ఆర్ఐ శేఖర్ ఉన్నారు.

కర్లపాలెం : మండలంలో ఏడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తహశీల్దారు కేశవ నారాయణ అన్నారు. యాజలి జడ్పీహెచ్ఎస్‌లో 350మంది, కర్లపాలెం పెద్దింటి అమ్మతల్లి మండపంలో 200మంది, చింతాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో 50మంది, పెదగొల్లపాలెం జడ్పీహెచ్ఎస్ లో 150మంది, పేరలి జడ్పీహెచ్ఎస్‌లో 50మంది, కట్టవాద సైక్లోన్ సెంటర్‌లో 50మంది, చిన్నపులివారి పాలెంలో 70మంది మొత్తం 920మందికి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలను సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పిటిసి పిట్ల వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ నక్క లలిత కుమారి, వీఆర్ఓ రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరంలో తుఫాను పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. యానాది సంఘంకు చెందిన వీరంతా డొంక రోడ్డు పూరి గుడిసెలతో కొందరు, మాచర్లవారిచెరువు కట్టపై కొందరు నివసిస్తుంటారు. సుమారు 83మందికి సౌకర్యాలు అందిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎంఇఓ నీలం దేవరాజ్ తెలిపారు. పునరావస కేంద్రాన్ని రేపల్లె ఆర్డీఓ హెలా షారోన్ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ డి వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ జి చంద్రశేఖర్, కార్యదర్శి జి శ్రీనివాసరావు, సర్పంచ్ కోటేశ్వరరావు ఉన్నారు.

చెరుకుపల్లి : మండలంలో 3గ్రామాల నుండి 68మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ బి వెంకటేశ్వర్లు తెలిపారు. గుళ్ళపల్లి బోర్లమ్మ డొంక, తూర్పుపాలెం ఎస్టీ కాలనీ, ఆరేపల్లి బోయినవారిపాలెం గ్రామానికి చెందిన వారిని తరలించినట్లు తెలిపారు.

కర్లపాలెం : తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు చింతయపాలెంలో గిరిజనులకు, రాళ్ల చెరువు దగ్గర ఉన్న గిరిజనులకు ఆహార పట్లాలు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు పి ధనుంజయరావు. ఎంపీటీసీ ఆర్ లక్ష్మణ, ఏ మహేష్, నాగరాజు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

రైతులను వెంటనే ఆదుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మాగాణి భూముల్లోని వరి పంట, మెట్ట ప్రాంతాల్లో సాగుచేసిన నినుము, ఇతర వాణిజ్య పంటలు వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తక్షణమే అంచనా వేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటల భీమా విడుదల చేయాలని కోరారు. పెద్దపులివరు, అత్య వారిపాలెం, భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి సుధాకర్, ఎం సత్యనారాయణ, కె రామస్వామి, వేములపల్లి వెంకటరామయ్య, జి నాగరాజు, ఎపిఇఒలు పాల్గొన్నారు.

చీరాల : సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలోని రోశయ్య కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. ఈ తుఫాన్ దాటికి మరింత దెబ్బతిన్నాయి. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ కోరారు. సెయింట్ ఆన్స్ పాఠశాల్లోని పునరవాస కేంద్రంలో ఉన్న కాలనీవాసులతో మాట్లాడారు. హౌసింగ్ అధికారులు కాలనీలో సర్వే కూడా చేశారని అన్నారు. నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం అందజేయాలని అన్నారు.

తుపాను బాధితులకు సహాయక చర్యలు



రామాపురంలో మత్స్యకారులతో ఎంఎల్ఎ బలరాం

ప్రజాశక్తి - వేటపాలెం

తుఫాను వలన ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. రామాపురం, కటారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం, ఊటుకూరి సుబ్బయ్య పాలెం, టెంకాయ చెట్లపాలెంలో పర్యటించారు. సీఈసీ కళాశాలలోని పునరావస కేంద్రంలోని ప్రజానీకాన్ని పలకరించారు. చిన్నారులు ఎమ్మెల్యే కరణం బలరాంతో ఫోటోలు దిగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజానం శ్రీనివాసరావు, ఆర్డీఓ పి సరోజినీ, డిఎస్పి ఎస్ ప్రసాదరావు, సిఐలు శేషగిరిరావు, సోమశేఖర్, తహసిల్దార్ యు అశోకవర్ధన్, ఎంవిఎస్ శర్మ, పంచాయితీ కార్యదర్శులు పరిణం పూర్ణ కుమారి, శివలీల పాల్గొన్నారు.

బాపట్ల : పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆహార పొట్లాలను మంగళవారం ప్రత్యేక వాహనాల ద్వారా బాధితులకు పంపిణీ చేశారు. ఆహార పొట్లాల పంపిణీని ఎంఎల్ఎ కోన రఘుపతి పరిశీలించారు. రోటరీ కళ్యాణ మండపంలో వంటశాలను మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ స్వయంగా పర్యవేక్షించారు. తహశీల్దారు సుధారాణి, మున్సిపల్ ఆర్ఓ సుబ్బారావు, ఏఈ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఇమాం సిద్ధం చేశారు.

భట్టిప్రోలు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని ఎంపిపి డివి లలిత కుమారి సూచించారు. మండలంలోని వెల్లటూరు పిహెచ్‌సిలో మంగళవారం వైద్యశాల కమిటీ సమావేశం నిర్వహించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. గర్భిణీలు, బాలింతలకు అవసరమైన చికిత్సలకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉదయ భాస్కర్, ఎంపీడీఓ గుమ్మ చంద్రశేఖర్, తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ సిహెచ్ రామలక్ష్మి, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలో పూసపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 52మందికి హై స్కూలులో, ఇంకొల్లు గ్రామానికి చెందిన 25మందికి హై స్కూలులో పునరావాసం కల్పించారు. మండలం స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, తహశీల్దారు పి బ్రహ్మయ్య, ఎంపీడీఓ ఆర్ రాజలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు సహాయక చర్యలు పర్యవేక్షించారు.



అధికారులకు సూచనలిస్తున్న భట్టిప్రోలు ఎంపిపి లలిత



ఇంకొల్లు పునరావాస శిబిరంలో బాధితులతో తహశీల్దారు



మినుము పంట పరిశీలిస్తున్న సిపిఎం నేత కృష్ణమోహన్

పంట పొలాల్లో సిపిఎం పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని లంక గ్రామాలైన తోకలవారిపాలెం, పోతర్లంక గ్రామాల్లోని పంట పొలాలను సిపిఎం నాయకులు టి కృష్ణమోహన్ పరిశీలించారు. తుఫాను వలన మాగాణి, మెట్ట పొలాలు దెబ్బతిన్నాయని అన్నారు. వరి, మినుము, అరటి దెబ్బతిన్నాయని వెంటనే అధికారులు పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట సిపిఎం నాయకులు బి సుబ్బారావు ఉన్నారు.

వర్షాలతో నిలిచిన క్వారీయింగ్

ప్రజాశక్తి-చీమకుర్తి

తుఫాన్ ప్రభావం చీమకుర్తి మండలంపైనా పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రానైట్ క్వారీంగు నిలిచిపోయింది. క్వారీ గుంతలు దాదాపు పది అడుగుల లోతులో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ నీటిని బయట కొట్టడానికి 100 హార్స్ పవర్ లు, 56 పవర్‌లు పెట్టి నీరు బయటకు కొడుతున్నారు. పొగాకు మిరప పంటలు ఉరకలు ఎత్తాయి. చీమకుర్తి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం రాత్రి వరకు పూర్తిగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ప్రజలు మంచినీళ్లకు, కనీస అవసరాలకు నానా అవస్థలు పడ్డారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో చెట్లు విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. వాటిని తొలగించడానికి విద్యుత్ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు.

10 అడుగుల మేర నిలిచిన వర్షపునీరు



క్వారీల్లో నిలిచిన నీరు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు - సంఘం జిల్లా నూతన కౌన్సిల్ ఎన్నిక

ప్రజాశక్తి-రేపల్లె

పోరాట మార్గంగానే సమస్యలను పరిష్కరిస్తూ నిరంతరం ఉపాధ్యాయులను చైతన్యం చేసే సంఘం యుటిఎఫ్ అని సంఘం రాష్ట్ర కార్యదర్శి బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. యుటిఎఫ్ నూతన కౌన్సిల్ ఎన్నిక పట్టణంలోని ఎంసీఏ హాల్లో జరిగింది. బాపట్ల జిల్లా ఎన్నికల అధికారిగా ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. పరిశీలకులుగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు వ్యవహరించారు.

కమిటీ ఎన్నిక:

గౌరవాధ్యక్షులుగా ఎస్.పాపారావు, అధ్యక్షులుగా జే.వినయ్‌కుమార్, సహాధ్యక్షులుగా బి.భిక్షాలుబాబు, అర్.హరిప్రియ, ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు కోశాధికారిగా ఎం.వెంకటేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల తమవంతు బాధ్యతగా పనిచేస్తామని నూతన కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్, శ్రీనివాసరావు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, డి.వీరాంజనేయులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలన్నారు. సిపిఎస్ స్థానంలో తెచ్చిన జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పిఆర్‌సి, డిఏ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, క్లోజర్లు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించి బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందించే వాతావరణాన్ని కల్పించాలన్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీల పేరుతో వర్క్ బుక్ కరెక్షన్స్, సిలబస్ పూర్తి చేయలేదనే చిన్నచిన్న కారణాలను చూపి ఉపాధ్యాయులకు ఛార్జిమెమోలతో వేధింపులు, కక్ష సాధింపు చర్యలతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధానాలను ప్రభుత్వం అధికారులు విడనాడాలన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోగా, విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెంబర్ 117 ద్వారా ఉపాధ్యాయ పోస్టుల కుదింపు, పాఠశాలల విలీనం వంటి కారణాలతో బడుగు, బలహీనవర్గాల పిల్లలు విద్యకు దూరమైపోతున్నారన్నారు. ఉపాధ్యాయులకు జారీ చేసిన ఛార్జిమెమోలను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేక విధానాలను విడనాడాలని వారు కోరారు.

బాపట్లలో పోలీసుల సహాయక చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మిచౌంగ్ తుఫాను బాపట్ల జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు వారి పరిధిలోని రెవెన్యూ, ఆరోగ్యం, మున్సిపల్, పంచాయితీ, విద్యుత్, ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, తుఫాను తీవ్రత వలన జరిగే నష్టాలను తగ్గించడానికి అవసరమైన రక్షణ చర్యలను తీసుకున్నారు. 114 మంది సిబ్బందితో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 4 ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశారు. 132 మంది పోలీస్ సిబ్బందిని ప్రమాద స్థాయిలో నీరు ప్రవహిస్తున్న కల్వర్టు లు, బ్రిడ్జ్ ల వద్ద నియమించారు. సుమారు 300 మంది పోలీసులను ప్రజలకు సహాయక చర్యలు అందించడానికి నియమించారు.

జిల్లాలోని అనేక ప్రాంతాలలో ఈదురు గాలులకు రోడ్లపై విరిగి పడిన చెట్లను పోలీస్ అధికారులు వెంటనే జేసిబి ల ద్వారా తొలగించి ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతలలోని ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాగులు వంకలు నిండి కల్వర్టుల పై నుండి ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలలో విధులు నిర్వహిస్తూ ప్రజలను అటుగా వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారు.



రోడ్డు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

అండగా ఉంటాం..అధైర్యపడొద్దు..

- తుపాన్ ప్రభావిత ప్రజలకు అండగా యంత్రాంగం
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా దృష్టి
- పంటల నష్టాలు అంచనా వేయిస్తాం
- వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులు మున్సిపల్ శాఖ మంత్రి సురేష్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుపాన్ ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాల అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ప్రభుత్వం తోడుగా ఉందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. తుపాన్‌తో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా దృష్టి పెట్టామన్నారు. జిల్లాపై తుపాన్ ప్రభావం, యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. తుపాన్ సహాయక చర్యల సమీక్ష, సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాకు నియమించిన స్పెషల్ ఆఫీసర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పిఎస్ ప్రద్యుమ్నతో కలిసి ఆయన ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, సివిల్ సప్లయ్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులందరికీ సంతప్తికర సేవలు అందించడంపై దష్టి పెట్టాలని మంత్రి సూచించారు. తుపాన్ ప్రభావం తగ్గిన తరువాత పంట నష్టం అంచనా వేస్తామని, నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఏ సీజన్ లో నష్ట పోయిన పంటకు అదే సీజన్‌లో పరిహారాన్ని ముఖ్యమంత్రి అందిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్ పిఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితులను బట్టి అవసరమైన చర్యలను యంత్రాంగం చేపట్టిందన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెలుసుకుంటున్నామనాష్ట్రన్నారు. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు ముందుగానే తరలించిందన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సెలవులను రద్దు చేసి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహాయ, పునరావాస చర్యలు చేపడుతుందన్నారు. తీరప్రాంత మండలాలతోపాటు సరిహద్దు మండలాల ప్రజలను కూడా అప్రమత్తం చేశామన్నారు. పూరిళ్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని, ఈ శిబిరాలలో భోజనం, మంచి నీటి సౌకర్యాలతోపాటు అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. 24 గంటలూ పనిచేసేలా కలెక్టరేట్ తో పాటు ఎస్పీ ఆఫీస్ లోనూ కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎస్‌పి మలిక గర్గ్ పోలీసు శాఖ తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోడ్లపై చెట్లు కూలిపోతే తొలగించటానికి అవసరమైన పరికరాలతో పోలీసు, మెరైన్, ఆర్ అండ్ బి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచామన్నారు. తీరప్రాంతం, వాగులు వంకల వద్ద ప్రత్యేక పికెట్స్, బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఏఎస్‌పి నాగేశ్వరరావు, జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, డిపిఒ జివి నారాయణరెడ్డి, డిఆర్‌డిఏ పీడీ టి.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్ధన్ ఆలీ, ఎపిసిపిడిసిఎల్ కెజిబి సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఇ కొండయ్య, ఆర్ అండ్ బి ఎస్ఇ దేవానందం, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెం.వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ పసుపులేటి మురళి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం సందర్శన

అనంతరం స్థానిక మంగమూరు రోడ్డులోని సత్యసాయి స్కూల్‌లో ఏర్పాటు చేసిన తుపాన్ పునరావాస కేంద్రాన్ని వీరు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలపై మంత్రి, స్పెషల్ ఆఫీసర్ పిఎస్ ప్రద్యుమ్న ఆరా తీశారు.



తుపాన్ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన వారితో మాట్లాడుతున్న మంత్రి సురేష్



ఒంగోలులోని సత్యసాయి పబ్లిక్ స్కూల్‌లో తుపాన్ బాధితులకు ఫలహారం అందజేస్తున్న అధికారులు